

గట్టును పటిష్టం చేస్తున్న కూలీలు

కొల్లేరు ముంపు నష్టం రూ. కోట్లలోనే..

- ముంపు నీటితో రోడ్లన్నీ అధ్వానం
- ఇళ్లు, చేపల చెరువులకు భారీ నష్టం
- మరోవైపు జీవనోపాధి లేక పాట్లు

మండవల్లి/కైకలూరు, సెప్టెంబరు 18: కొల్లేరు వరదతో లంక గ్రామాల్లో రూ.కోట్లలో నష్టం వాటిల్లినట్లు అంచనా వేస్తున్నారు. పది రోజులుగా ముంపు నీటిలోనే లంక గ్రామాలు మగ్గుతూ గృహాలు సైతం వరద నీటికి దెబ్బతిన్నాయని లంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గ్రామాల్లోని రహదారులు పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకోవడంతో ముంపు నీరు తగ్గినా రహదారులకు భారీ నష్టం వాటిల్లుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు పది రోజులుగా గ్రామాలు వదిలి బయటకు రాలేక కూలి పనికి వెళ్లలేక జీవనోపాధి సాగక లంక గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. బాధితులంతా ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తున్నారు. మరోవైపు ముంపునకు గురైన చేపల చెరువుల్లో చేపలు ఏ మేరకు ఉంటాయో.. ఏ మేరకు నష్టం వాటిల్లిందో అర్థం కాక చేపల రైతులు బిక్కుబిక్కుమంటున్నారు. వరద ముంపు నుంచి చెరువులను కాపాడుకునేందుకు వలలు, మట్టి బస్తాలు వంటివి వేసినప్పటికీ చాలావరకు చెరువుల్లో చేపలు, రొయ్యలు వరదలో కొట్టుకుపోయాయి. కైకలూరు నియోజకవర్గానికి చెందిన ఓ ఆక్వా రైతు మండవల్లి మండలానికి కొల్లేరు సరిహద్దు ప్రాంతమైన కాళింగపేట ప్రాంతంలో వందల ఎకరాల్లో రొయ్యలు సాగు చేస్తుండగా వరదకు పూర్తిగా నష్టపోయినట్టు సమాచారం. చాలా మంది రైతులది ఇదే పరిస్థితి. కైకలూరు మండలంలోను శృంగవరప్పాడు, లక్ష్మీపురం, గోకర్ణపురం, పందిరిపల్లిగూడెం, కొట్టాడ గ్రామాల్లో చేపలు, రొయ్యల చెరువులు కొల్లేరు వరద ముంపులో కలిసిపోయాయి.



చెరువులో రొయ్యలు బయటకు వెళ్లకుండా వలలు వేసిన దృశ్యం



గౌరవ వందనం స్వీకరిస్తున్న డీజీపీ ద్వారకా తిరుమలరావు

మెరుగైన సేవలు అందించాలి : డీజీపీ

ఎస్పీలతో నేర సమీక్షా సమావేశం

ఏలూరు క్రైం, సెప్టెంబరు 18 : ప్రజలకు పోలీసులు మెరుగైన సేవలు అందించి జవాబుదారీగా ఉండాలని ప్రతి ఒక్కరు చట్టాన్ని గౌరవించాలని రాష్ట్ర డీజీపీ సీహెచ్ ద్వారకాతిరుమలరావు అన్నారు. ఏలూరులో బుధవారం ఉదయం ఏలూరు రేంజ్ పరిధిలో ఉన్న ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా, కృష్ణా జిల్లా, కాకినాడ జిల్లా, బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల ఎస్పీలతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. నేరాల అదుపు, శాంతి భద్రతలను కాపాడేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. వాహ నాలు పాతబడి పోయాయని వాటి స్థానంలో కొత్త వాహనాలు సమ కూరుస్తామన్నారు.సిబ్బంది కొరత అధిగమించేందుకు పోలీస్ రిక్రూట్‌మెంట్ నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే విడుదలైన పోస్టులకు సంబంధించి కొన్ని సాంకేతిక ఇబ్బందులు ఉన్నాయని వాటిని పరిష్కరించి భర్తీ చేస్తామన్నారు. మహిళలు, మైనర్ బాలికలపై జరుగుతున్న అత్యాచా రాలను అరికట్టేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. గంజాయి మాదక ద్రవ్యాలపై ప్రజలకు అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న విద్యార్థులకు వాటి వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించాలన్నారు. సమావేశంలో ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్, ఏలూరు జిల్లా ఎస్పీ కిషోర్, పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహారావు, కృష్ణా జిల్లా ఎస్పీ గంగాధరరావు, కాకినాడ ఎస్పీ విక్రాంత్ పటేల్, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ వడ్డేపల్లి కృష్ణారావులు పాల్గొన్నారు. అంతకు ముందు డీఐజీ కార్యాలయం వద్ద జిల్లా పోలీసులు గౌరవ వందనం చేశారు. డీఐజీ కార్యాలయంలో ఉన్న ఆయనను ఐజీ అశోక్‌కుమార్, ఏలూరు కలెక్టర్ వెట్రి సెల్వి, ఎస్పీ కిషోర్‌లు పుష్ప గుచ్ఛాలు అందించి మర్యాద పూర్వ కంగా కలిశారు. జిల్లాలో శాంతి భద్రతల సమస్యలపై డీజీపీతో కలెక్టర్ చర్చిం చారు. జిల్లా పోలీసు అధి కారుల సంఘ అధ్యక్షుడు నాగేశ్వరరావు ఆధ్వ ర్యంలో జిల్లా పోలీస్ అసోసి యేషన్ ప్రతినిధులు డీజీ పీని కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

వంట నూనె నిల్వలపై విజిలెన్స్ తనిఖీలు

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 18 : వంట నూనెలపై కస్టమ్స్ సుంకం పెంచే అవకాశం ఉందని, పండుగ సీజన్‌లో వంట నూనెల డిమాండ్ ఉన్న నేపథ్యం లో ధరలు అధికంగా పెంచుతున్నారనే సమాచారంతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్ రాష్ట్ర ఉన్నతాధికారులు ఇచ్చిన ఆదేశాలతో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. ఏలూరు లోని శ్రీగాదంశెట్టి వెంకట సుబ్బారావు దుకాణంలో నూనె నిల్వలను తనిఖీ చేసి 15 కేజీల ఆయిల్ డబ్బాలపై అమ్మకం ధరను నమోదు చేయని కార ణంగా షాపు యజమానిపై లీగల్ మెట్రాలజీ అధికారులు కేసు నమోదు చేశారు. నూజివీడు పట్టణంలో విజయలక్ష్మి ఎంటర్ ప్రైజెస్ హోల్‌సేల్ ట్రేడర్స్‌లో తనిఖీ చేసి అక్కడ నిల్వలో వ్యత్యాసాలు ఉండడంతో చర్యలకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ డీఎస్పీ వెంకటేశ్వరరావు, విజిలెన్స్ డీఈఈ శ్రీనివాసన్, విజిలెన్స్ సీఐ శివరామకృష్ణ, విజిలెన్స్ ఈఈ శ్రీనివాసరావు, రూపేష్‌వర్మ, అనిల్‌బాబు, విజిలెన్స్ ఏజీ శ్రీధర్, విజిలెన్స్ తహసీల్దార్ కన్యాకుమారి, ఏవో సురేష్, విజిలెన్స్ ఎస్ఐ రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్ కార్మికుల జీతాలు విడుదల చేయాలి

నూజివీడు, సెప్టెంబరు 18: స్వచ్ఛభారత్ కార్మికు లకు పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని, నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో క్లాప్ మిత్రాలు ధర్నా నిర్వహించి, ఆర్డీవో భవానీ శంకరికి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చాట్ల పుల్లారావు మాట్లాడుతూ మున్సిపాల్టీలతో సమానంగా స్వచ్ఛభారత్ కార్మికులకు వేతనాలు పెంచాలని, కనీస వేతన చట్టం అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, మెడికల్ ఇన్సూరెన్స్, బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. స్వచ్ఛభారత్ కార్మికులు బద్రె శ్రీనివాసరావు, ముల్లంగి రాంబాబు, తులిమెల్లి ఏసుబాబు, యోబు, తిరుపతిరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు కలిదిండిలో రైతుల సమావేశం

కలిదిండి, సెప్టెంబరు 18 : కలిదిండి మార్కెట్ యార్డు ఆవరణలో గురువారం ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆధ్వర్యంలో రైతుల సమావేశం నిర్వహిస్తున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి తెలిపారు. భారీ వర్షాల కారణంగా పంట కాల్వలు, మురుగు కాల్వలు పరిస్థితి అధ్వానంగా ఉండటంతో రైతులు ఇబ్బందులు పడుతుండటంతో సమస్య శాశ్వత పరిష్కారానికి ఏర్పాటు చేసిన సమావేశానికి రైతులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

దోషిని తక్షణమే శిక్షించాలి : దూలం

కైకలూరు, సెప్టెంబర్ 18: ఏలూరు సేవాశ్రమంలో విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సేవాశ్రమంలో మేట్రిన్ భర్త అరాచకాలను వెలుగులోకి తీసుకువచ్చి అతనిని కఠినంగా శిక్షించాలని కోరారు.

డ్రైవర్‌కు జైలు, జరిమానా

నూజివీడు టౌన్, సెప్టెంబరు 18: నిర్లక్ష్యంగా కారు నడిపి ఒకరి మృతికి కారణమైన డ్రైవర్‌కు మూడు నెలలు జైలు, రూ.1,500లు జరిమానా విధిస్తూ నూజివీడు స్పెషల్ మెజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి తీర్పు వెలువరించారు. 2021 మే 1న పోతిరెడ్డిపల్లికి చెందిన అక్కినేని బెనర్జీ కారులో వస్తూ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ఘటనలో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న బెక్కం నరేష్ తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. నూజివీడు పట్టణ పోలీసులు నిందితుడు బెనర్జీపై కేసు నమోదు చేయగా విచారణ చేసిన మెజిస్ట్రేట్ కృష్ణమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు.

రూ. 9.09 లక్షలు పలికిన వినాయకుడి లడ్డూ



లడ్డూను దక్కించుకున్న కొనకళ్ళ మాధవరావు

నూజివీడు టౌన్, సెప్టెంబరు 18: వేలంలో వినాయ కుడి లడ్డూ ప్రసా దం భారీ ధర పలి కింది. నూజి వీడు మండలం మిట్టగూ డెం గ్రామంలో నెలకొల్పిన మండ పం వద్ద బుధవారం స్వామివారి లడ్డూ ప్రసాదానికి వేలం నిర్వహించగా హనుమంతుల గూడెం మాజీ ఎంపీటీసీ కొనకళ్ళ మాధవరావు రూ. 9.09 లక్షలకు దక్కించుకున్నారు. ఆయనకు సర్పంచ్ కొనకళ్ళ నరసింహారావు, వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు లడ్డూ ప్రసాదాన్ని అందించారు. గణపతి నవరాత్రులు పూర్తికావడంతో భారీ అన్నసమారాధన నిర్వహించారు.



కైకలూరు నియోజకవర్గ కో-ఆర్డినేషన్ కమిటీతో సీఎం చంద్రబాబు

సమన్వయంతో రాష్ట్రాభివృద్ధికి తోడ్పడండి

కైకలూరు, సెప్టెంబరు 18: విభేదాల్లేకుండా మూడు పార్టీలు సమన్వయంగా పనిచేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడపాలని సీఎం చంద్రబాబు సూచించినట్లు కైకలూరు నియోజకవర్గ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు తెలిపారు. మంగళవారం రాత్రి రాష్ట్రంలోని టీడీపీ ఇన్‌చార్జిలు, కోఆర్డినేషన్ కమిటీలతో 100 రోజుల పాలనపై అమరావతిలో సీఎం చంద్రబాబు సమీక్షా సమావేశం నిర్వహించారని, పొత్తుల్లో భాగంగా జనసేన, బీజేపీలకు సీట్లు కేటాయించిన చోట టీడీపీ ఇన్‌చార్జిలు, కన్వీనర్లు మిగిలిన రెండు పార్టీలతో సమన్వయంగా పనిచేయాలని సూచించారని, త్వరలోనే జిల్లాలకు ఇన్‌చార్జి మంత్రులను కేటాయిస్తామని వారి ద్వారా మూడు పార్టీల నాయకులు సమన్వ యంగా పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తేవాలని సూచించినట్లు తెలిపారు. కైకలూరు నియోజకవర్గ కో-కన్వీనర్లు కమ్మిలి విఠలరావు, బొమ్మనబోయిన విజయలక్ష్మి, కొడాలి వినోద్, బలే ఏసురాజు పాల్గొన్నారు.

అక్టోబరు 8 నాటికి గృహ నిర్మాణాలు పూర్తి



బి.రంగారావు, హౌసింగ్ డీఈ

నూజివీడు, సెప్టెంబరు 18: గృహ నిర్మాణ శాఖ పరిధిలో అక్టోబరు 8 నాటికి 100 శాతం గృహ నిర్మా ణాలు పూర్తిచేయడమే లక్ష్యంగా చర్యలు చేపడుతు న్నట్టు ఆ శాఖ డీఈ బి.రంగారావు తెలిపారు. బుధవారం నూజివీడు డీఈ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నూజివీడు నియోజకవర్గ పరిధిలో 767 గృహాలు తక్షణం పూర్తి చేసే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇందులో 369 గృహాలను పూర్తిచేయగా, మరో 398 స్లాబ్ లెవల్లో ఉన్నాయని, లబ్ధిదారులతో మాట్లాడి కావాల్సిన సామగ్రిని సరఫరా చేసి త్వరితగతిన నిర్మాణాలు పూర్తిచేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. నూజివీడు నియోజకవర్గ పరిధిలో ఏడు గృహాలను మంగళవారం లబ్ధిదారులతో గృహప్రవేశాలు జరిపించామన్నారు. లబ్ధిదారులకు అందించాల్సిన నగదును వారి వ్యక్తిగత ఖాతాలకు జమ చేస్తామన్నారు. అలాగే నూజివీడు నియోజకవర్గంలో వివిధ లే అవుట్‌లలో ఖాళీగా ఉన్న నివేశనా స్థలాలను గుర్తించి లబ్ధిదారులు ఎందుకు నిర్మాణాలు చేపట్టడం లేదన్న అంశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. దీనికి సంబంధించి యాక్షన్‌ప్లాన్ రూపొందించి భవన నిర్మాణాలు ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నామని, సుమారు 3,747 గృహాలు నియోజకవర్గంలో నిర్మాణంలో ఉన్నాయని ఆయన తెలిపారు.

2900 ఎకరాల్లో పంట నష్టం



ముదినేపల్లి, సెప్టెంబరు 18 : భారీ వర్షాల వల్ల సార్వా వరి పంట నష్టం వివరాలను ముదినేపల్లి మండలంలో ప్రకటించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో సుమారు 2900 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయా దికారులు గుర్తించారు. ఆయా గ్రామాల్లో పంట నష్టంపై రూపొందించిన తుది జాబితాలను పంచాయతీ కార్యాలయాల వద్ద గ్రామ వ్యవసాయ సహాయకులు, వీఆర్వోలు ప్రదర్శించారు. తుది జాబితాలను ఉన్నతాధికారులకు పంపినట్లు ఏవో విద్యాసాగర్ తెలిపారు.



కొల్లేరు ముంపు బాధితులకు సీపీఎం నిత్యావసరాల పంపిణీ

రూ.25 వేలు చొప్పున ఇవ్వాలి : మంతెన

మండవల్లి, సెప్టెంబరు 18: కొల్లేరు ముంపు బాధిత కుటుంబాలకు రూ.25 వేలు చొప్పున రాష్ట్ర ప్రభుత్వం పరిహారం అందించాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు మంతెన సీతారాం డిమాండ్ చేశారు. బుధవారం మండవల్లి మండలం మణుగులూరులో సీఐటీయూ ఆధ్వర్యంలో వరద బాధితులకు నిత్యావసర వస్తువులు పంపిణీని ఆయన ప్రారంభించారు. సీతారాంతో పాటు సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు. బాధిత కుటుంబాలకు కందిపప్పు, వంటనూనె, గోధుమపిండి, ఉల్లిపాయలు, సాల్ట్ ప్యాకెట్‌తో కూడిన కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ కొల్లేరుపై పలు కమిటీలు నివేదికలు ఇచ్చినా కొల్లేరు ప్రజల రక్షణకు గత ప్రభుత్వాలు చర్యలు చేపట్ట లేదని విమర్శించారు. మాజీ సర్పంచ్ సుగుణరావు, సీపీఎం నాయకుడు ఎస్. మహంకాళి, అంగన్వాడీ, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



సాగుదారులకు పట్టాలివ్వాలని ధర్నా

ముసునూరు, సెప్టెంబరు 18: రమణక్కపేటలో అటవీ భూములను సాగుచేసుకుంటు పేదలకు ప్రభుత్వం వెంటనే పట్టాలు మంజూరు చేయాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర నాయకుడు డి.హరినాథ్ డిమాండ్ చేశారు. బుధవారం ముసునూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద సాగుదారులతో కలసి ధర్నా నిర్వహించి మాట్లాడుతూ అర్హులైన సాగుదారులను గుర్తించి పట్టాలివ్వాలని ఉన్నతాధికారులకు వినతపత్రాలు అందజేసినా నేటికి పేదలకు న్యాయం జరగలేదన్నారు. వీరికి పట్టాలు లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు వర్తించడం లేదని, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు నష్టపోయినా పరిహారం అందక తీవ్రంగా నష్టపోతున్నారని, ఇప్పటికైన ప్రభుత్వం పట్టాలివ్వాలని డియాండ్ చేశారు. నాయకులు వేముల బక్కయ్య ఆముదాల చంటి, గరిక ఆఖిల్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీపై డ్రోన్లు

ముసునూరు, సెప్టెంబరు 18: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు వినియోగించుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎస్.మధుమోహన్ అన్నారు. బుధవారం చెక్కపల్లిలో జరిగిన పొలంబడి కార్యక్రమంలో ఆయన డ్రోన్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. డ్రోన్‌తో తక్కువ సమయంలో పురుగు మందులను పిచికారి చేసుకోవచ్చన్నారు. దీంతో కూలీల కొరతను అధిగమించి, అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో వివరించారు. డ్రోన్లను 40 శాతం సబ్సీడీతో అందిస్తున్నట్టు తెలిపారు. ఇంటర్మీడియట్ ఆపైన చదువుకున్న ఆసక్తిగల యువతకు డ్రోన్ వినియోగంపై ఉచిత శిక్షణ ఇచ్చి, 50 శాతం సబ్సిడీపై వారికి డ్రోన్‌లు ఇస్తామన్నారు. అనంతరం డ్రోన్‌తో పురుగు మందు పిచికారి విధానాన్ని రైతులకు చూపించారు. వీహెచ్ఏలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



నియోజకవర్గ క్రీడా పోటీలకు ఎంపికైన బాలికలు

మండల స్థాయి బాలికల క్రీడా పోటీలు

నూజివీడు టౌన్, సెప్టెంబరు 18: నూజివీడు మండల స్థాయి బాలికల క్రీడా పోటీలను ఎస్ఆర్ఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించారు. నూజివీడు ఎంఈవో-2 జమలయ్య పోటీలను ప్రారంభించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ తదితర పోటీలను నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తున్నట్టు ఆయన తెలిపారు. పీడీలు అన్నామణి, స్వప్న, రాణి, సరళ, నాగరాజు, వనజ తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభ కనబర్చిన త్రివిధ విద్యార్థులు

త్రివిధ విద్యార్థుల ప్రతిభ..

నూజివీడు మండల స్థాయి క్రీడా పోటీల్లో త్రివిధ విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. మొత్తం 34 మంది విద్యార్థులు వివిధ క్రీడల్లో ప్రతిభ కనబర్చినట్లు చెప్పారు. సీనియర్ కబడ్డీలో ఐదుగురు, జూ.కబడ్డీలో ఇద్దరు, సీనియర్ వాలీబాల్లో ఆరుగురు, జూనియర్ వాలీబాల్‌లో ఆరుగురు, ఖోఖో సీనియర్స్ పోటీల్లో నలుగురు, జూనియర్స్‌లో ముగ్గురు, షటిల్‌లో నలుగురు, చెస్‌లో నలుగురు విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు ఆయన తెలిపారు.







ముసునూరు, కలిదిండి, ముదినేపల్లిలో నిమజ్జనాలకు తరలుతున్న గణనాథులు

ముగిసిన చవితి ఉత్సవాలు

ముసునూరు, సెప్టెంబరు 18: మండలంలో వినాయక చవితి ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. ముసునూరు రావిచెట్టు సెంటర్‌లోని మహాగణపతికి ప్రత్యేక పూజలు చేసి, వైభవంగా ఊరేగించి నిమజ్జనం చేశారు. స్వామివారి ఐదు కేజీల లడ్డూ ప్రసాదాన్ని కంచర్ల ఏడుకొండలు రూ.16 వేలకు పాటలో దక్కించుకున్నారు. అనంతరం భారీ అన్నసమారాధన జరిగింది.

కలిదిండి: కలిదిండిలో వాటర్ ట్యాంక్ వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడిని బుధవారం మేళతాళాలతో ఊరేగించి నిమజ్జనం చేశారు. కలిదిండి సెంటర్‌లో వినాయకుడి మండపంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. సుమారు 9 వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. సర్పంచ్ మారుతీ ప్రసన్న, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు నున్న రమాదేవి, ఏఎంసీ మాజీ ఛైర్మన్ గోరిపర్తి సుబ్బారావు, ఆలయ కమిటీ సభ్యులు బోయిన గోవింద్, మేకా భోగేశ్వరరావు, శ్రీనివాసరావు, భట్రాజు ఏసుబాబు, ఎంపీటీసీ నీలి సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: ముదినేపల్లి మండలంలో నిమజ్జనోత్సవాలు బుధవారం కోలాహలంగా జరిగాయి. అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం మండలంలోని కోడూరు వినాయకుడిని సుమారు పది కిలోమీటర్లు ఊరేగింపుగా తీసుకొచ్చి నిర్వాహకులు ముదినేపల్లిలోని పోల్‌రాజ్ ప్రధాన పంటకాల్వలో నిమజ్జనం చేశారు. గురజ, వడాలి, ముదినేపల్లి గ్రామాల్లో వినాయకుడి విగ్రహాల నిమజ్జనోత్సవాలు వైభవంగా జరిగాయి. ఎస్ఐ వెంకట్ కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

వరద బాధితులకు విరాళాలు



ముదినేపల్లి, సెప్టెంబరు 18 : ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ పిలుపు మేరకు వరద బాధితుల సహాయార్థం ముదినేపల్లి మండలంలోని పలువురు టీడీపీ, జనసేన నాయకులు, రైతులు విరాళాలను సీఎం సహాయ నిధికి అందజేశారు. తెలుగు రైతు జిల్లా అధికార ప్రతినిధి బొప్పన సుందర రామయ్య రూ.25 వేలు, జనసేన మండల కన్వీనర్ వీరంకి వెంకటేశ్వరరావు, జిల్లా సంయుక్త కార్యదర్శి మోటేపల్లి హనుమ రూ.15 వేలు, ప్రొద్దువాక, వైవాక రైతులు తమ విరాళాలను ఎమ్మెల్యే కామినేనికి అందజేశారు.

భారతీయ విద్యానికేతన్ చేయూత

ముసునూరు, సెప్టెంబరు 18: ముసునూరులోని భారతీయ విద్యానికేతన్ హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, యాజమాన్యం విజయవాడ వరద బాధితులకు విరాళం అందజేశారు. ప్రిన్సిపాల్ కొండేటి శౌరి బుధవారం సీఎం సహాయ నిధికి రూ. 43,854ల చెక్కు అందజేశారు. ప్రిన్సిపాల్, విద్యార్థులను మంత్రి పార్థసారథి అభినందించారు.

నూజివీడులో వ్యాయామోపాధ్యాయుల వితరణ



నూజివీడు టౌన్, సెప్టెంబరు 18: నూజివీడు వరద బాధితులకు నియోజకవర్గ వ్యాయామ ఉపాధ్యాయులు నిత్యావసరాలను పంపిణీ చేశారు. బుధవారం నూజివీడు ఎస్ఆర్ఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో ఎన్టీఆర్ కాలనీకి చెందిన వరద బాధితులకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. పీడీలు నాగరాజు, వనజ, లక్ష్మి, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు వైద్య పరీక్షలు

నూజివీడు, సెప్టెంబరు 18: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా నూజివీడు కోనేరుపేట అర్బన్ పీహెచ్‌సీలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య అధికారిణి డాక్టర్ కొలుసు సౌమ్య మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు విధిగా పరీక్షలు చేయించుకోవాలని, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకట రామిరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నూజివీడు, సెప్టెంబరు 18: నూజివీడు ప్రభుత్వ ఐటీఐలో ఖాళీగా ఉన్న ట్రేడ్‌లలో సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ భూషణం తెలిపారు. ఈ నెల 26వ తేదీలోపు పదోతరగతి పాసైన అభ్యర్థులు తమ దరఖాస్తులను దాఖలు చేయాలన్నారు. ఈ నెల 27న సర్టిఫికెట్ల వెరిఫికేషన్, 28న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు తెలిపారు.

గొర్రెల కాపరులకు దాణా పంపిణీ



ముసునూరు, సెప్టెంబరు 18: చెక్కపల్లిలో గొర్రెల కాపరులకు బుధవారం ప్రభుత్వం తరఫున టీడీపీ నాయకులు దాణా, మం దులను పంపిణీ చేశారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కందుల పిచ్చియ్య, కాటేపల్లి శ్రీనివాసరావు, మాజీ ఉప సర్పంచ్ తల్లిబోయిన సత్యనారాయణ 27 మంది గొర్రెల కాపరులకు 3 టన్నుల దాణాను అందజేశారు. భారీ వర్షాలు, వరదల వల్ల నష్టపోయిన కాపరులను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని, అందులో భాగంగా గొర్రెలు, మేకలకు పోషకాలతో కూడిన దాణాను ఇవ్వడం జరిగిందని నాయకులు పేర్కొన్నారు.

పెద్దచెరువు కట్ట బలోపేతం



ముసునూరు, సెప్టెంబరు 18: చెక్కపల్లిలో పెద్దచెరువు కట్టను సర్పంచ్ రాధికా సత్యనారాయణ ఆధ్వర్యంలో బుధవారం బలోపేతం చేశారు. ఇటీవల వర్షాలకు చెరువుకు బసవరపు పాడు వాగు నుంచి వరదనీరు ఉధృతంగా రావడంతో చెరువుకట్ట ప్రమాదకరంగా ఉన్న ప్రదేశంలో సర్పంచ్ గతంలో ఇసుక బస్తాలు వేసి కట్టను బలోపేతం చేశారు. అయితే మంత్రి పార్థసారథి సూచన మేరకు సర్పంచ్ చెరువుకట్ట తెగకుండా ముందస్తుగా సుమారు 100 ట్రిప్పులు గ్రావెల్‌తో కట్టను బలోపేతం చేశారు. టీడీపీ నాయకులు పనులను పర్యవేక్షించారు.

అవార్డు సాధించిన తుమ్మగూడెం పాల సంఘం



చాట్రాయి, సెప్టెంబరు 18: కృష్ణామిల్క్ యూనియన్ పరిధిలో తుమ్మగూడెం పాల సహకార సంఘం 2023-24 సంవత్సరానికి గాను ఉత్తమ సేవలలో జిల్లాలో ద్వితీయ స్థానంలో నిలిచింది. విజయవాడ పాల ఫ్యాక్టరీ ఫంక్షన్ హాల్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు తుమ్మగూడెం సంఘం అధ్యక్షురాలు పద్మావతికి అవార్డు అందజేశారు. రైతులకు అత్యధిక పాల ధర చెల్లింపు, బోనస్ పంపిణీ, సంక్షేమ పథకాలు, సాంకేతిక విధానాల అమలులో మంచి ప్రగతి సాధించినందుకు అవార్డుకు ఎంపికైనట్టు క్లస్టర్ మేనేజర్ సాంబశివమూర్తి చెప్పారు. సంస్థ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

బొమ్మినంపాడులో సీమంతాలు

ముదినేపల్లి, సెప్టెంబరు 18 : పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బొమ్మినంపాడు గ్రామ సచివాలయాల పరిధిలోని గర్భిణులకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రసన్న సీమంతాలు నిర్వహించి వారు తీసుకోవాల్సిన పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఆకుకూరలు, పాలు, గుడ్లు, మాంసం, చేపలు తీసుకోవాలని సూచించారు. ఏఎన్ఎం, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కలిదిండిలో స్వచ్ఛతా హీ సేవ

కలిదిండి, సెప్టెంబరు 18 : కలిదిండిలో బుధవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు నిర్వహించారు. సైక్లథాన్, మారథాన్‌లు నిర్వహించారు. ఖాళీ ప్రదేశాల్లో నిల్వ ఉన్న నీరును తొలగించి బ్లీచింగ్, దోమల నివారణ మందులను చల్లారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మారుతీ ప్రసన్న, పంచాయతీ కార్యదర్శి ఉదయ్ కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాలికలకు వరం.. సుకన్య సమృద్ధి యోజన



ముదినేపల్లి, సెప్టెంబరు 18 : పోస్టల్ శాఖ అమలు చేస్తున్న సుకన్య సమృద్ధి యోజనలో బాలికలను చేర్పించేందుకు తల్లిదండ్రులు ముందుకు రావాలని కైకలూరు సర్కిల్ అధికారి పి.దుర్గా ప్రసాదరావు కోరారు. బుధవారం వాడవల్లి యూపీ పాఠశాలలో ఈ పథకంపై అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ పదేళ్ల లోపు బాలికలు ఈ పొదుపు పథకానికి అర్హులని, దీనివల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. హెచ్ఎం ఎం.సాయిలక్ష్మి, ఎస్ఎంసీ ఛైర్మన్ హైమవతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ముగ్గురు విద్యార్థినులు ఈ పథకంలో చేరారు.